"మధురమైన పిల్లలూ - ఎంతగా స్మృతిలో ఉంటారో, పవిత్రంగా అవుతారో అంతగా పారలౌకిక తల్లి-తండ్రి యొక్క దీవెనలు లభిస్తాయి, దీవెనలు లభించడంతో మీరు సదా కొరకు సుఖవంతులుగా అవుతారు"

ప్రశ్న:- తండ్రి పిల్లలందరికీ ఏ సలహాను ఇచ్చి చెడు కర్మలు నుండి రక్షిస్తారు?

జవాబు:- బాబా సలహా ఏమిటంటే - పిల్లలూ, మీ వద్ద ఏవైతే ధనము, సంపద మొదలైనవి ఉన్నాయో, వాటన్నింటినీ మీ వద్దనే ఉంచుకోండి కానీ ట్రస్టీలుగా అయి నడుచుకోండి. మీరు - ఓ భగవంతుడా, ఇదంతా నీదే అని అంటూ వచ్చారు. భగవంతుడే బిడ్డను ఇచ్చారు, ధన-సంపదలను ఇచ్చారు అని అంటారు, ఇప్పుడు భగవంతుడే అంటున్నారు, వీటన్నింటి నుండి బుద్ధియోగాన్ని తొలగించి మీరు ట్రస్టీలుగా అయి ఉండండి, శ్రీమతముపై నడవండి, అప్పుడు ఏ చెడు కర్మలు జరగవు, మీరు శ్రేష్ఠులుగా అవుతారు.

పాట:- తల్లి-తండ్రుల దీవెనలను తీసుకోండి... (లే లో దువాయే మా బాప్ కీ...)

ఓం శాంతి. ఏ పిల్లలైతే - మా నోరు తెరుచుకోవడం లేదు, అర్థం చేయించలేకపోతున్నాము అని అంటారో - వారికి సెంటర్లోని బ్రాహ్మణీలు ఎలా నేర్పించాలి అనేది శివబాబా అర్థం చేయిస్తారు. చిత్రాలపై అర్థం చేయించడం చాలా సహజము. చిన్న పిల్లలకు చిత్రాలను చూపించి అర్థం చేయించాల్సి ఉంటుంది కదా. అందరూ క్లాసులోకి వచ్చి కూర్చోగానే మీరు మురళీని మొదలుపెట్టేస్తారు అన్నట్లు కాదు. ఈ విషయాలను వారికి లోతుగా కూర్చొని అర్థం చేయించాలి. పిల్లలు పాటనైతే విన్నారు - ఒకరేమో పారలౌకిక తల్లి-తండ్రి, వారిని నీవే తల్లివి-తండ్రివి... అని స్మృతి చేస్తూ ఉంటారు, వారు సృష్టి రచయిత. తల్లి-తండ్రి తప్పకుండా స్వర్గాన్నే రచిస్తారు. సత్యయుగములో స్వర్గవాసీ పిల్లలు ఉంటారు. ఇక్కడి తల్లి-తండ్రులు స్వయమే నరకవాసులుగా ఉన్నారు కావున జన్మనిచ్చేది కూడా నరకవాసీ పిల్లలకే. పాటలో - తల్లి-తండ్రుల దీవెనలు తీసుకోండి అని అన్నారు... ఈ సమయంలోని తల్లి-తండ్రులు దీవెనలు ఇవ్వరని మీకు తెలుసు. స్వర్గవాసులు దీవెనలు ఇస్తారు, ఆ దీవెనలు అర్ధకల్పం కొనసాగుతాయి. అర్ధకల్పం తర్వాత మళ్ళీ శాపితులుగా అయిపోతారు. స్వయం కూడా పతితులుగా అవుతారు, పిల్లలను కూడా అలాగే తయారుచేస్తారు. దానిని దీవెనలు ఇవ్వడం అని అనరు. శాపాన్ని ఇస్తూ-ఇస్తూ భారతవాసులు శాపితులుగా అయిపోయారు, ఎంతటి దుఃఖమే దుఃఖముంది, అందుకే మాత-పితను తలచుకుంటారు. ఇప్పుడు ఆ మాత-పిత దీవెనలు ఇస్తున్నారు. వారు చదివించి పతితుల నుండి పావనులుగా తయారుచేస్తున్నారు. ఇక్కడ ఉన్నది అసురీ సాంప్రదాయము, రావణ రాజ్యము. అక్కడ ఉన్నది దైవీ సాంప్రదాయము, రామ రాజ్యము. రావణుడి జన్మ కూడా భారత్ లోనే జరుగుతుంది. అలాగే శివబాబా, ఎవరినైతే రామ అని అంటారో, వారి జన్మ కూడా భారత్ లోనే జరుగుతుంది. మీరు ఎప్పుడైతే వామ మార్గంలోకి వెళ్ళిపోతారో అప్పుడు భారత్ లో రావణ రాజ్యం ప్రారంభమవుతుంది. కావున భారత్ నే రాముడైన పరమపిత పరమాత్మ వచ్చి పతితము నుండి పావనముగా తయారుచేస్తారు. రావణుడు వస్తే మనుష్యులు పతితులుగా అవుతారు. రాముడూ వెళ్ళిపోయాడు, రావణుడూ వెళ్ళిపోయాడు, వారి పరివారంలోని వారందరూ కూడా వెళ్ళిపోయారని గానం చేస్తారు. రాముని పరివారమైతే చాలా చిన్నది. మిగిలిన ధర్మాలన్నీ అంతమైపోతాయి, వారందరి వినాశనము జరుగుతుంది. దేవీ-దేవతలైన మీరు మిగిలి ఉంటారు. ఇప్పుడు మీరెవరైతే బ్రాహ్మణులుగా అయ్యారో వారే సత్యయుగములోకి ట్రాన్స్ఫర్ అవుతారు. కావున ఇప్పుడు మీకు తల్లి-తండ్రి యొక్క దీవెనలు లభిస్తున్నాయి. తల్లి-తండ్రి మిమ్మల్ని స్వర్గానికి యజమానులుగా తయారుచేస్తారు. అక్కడైతే సుఖమే సుఖము ఉంటుంది. ఈ సమయంలో కలియుగములో దుఃఖం ఉంది, అన్ని ధర్మాలూ దుఃఖితముగా ఉన్నాయి. ఇప్పుడు కలియుగము తర్వాత మళ్ళీ సత్యయుగము రానున్నది. కలియుగములో ఎంతమంది మనుష్యులు ఉన్నారు, సత్యయుగములో ఇంతమంది మనుష్యులు ఉండరు. ఎంతమంది బ్రాహ్మణులైతే ఉంటారో వారంతా మళ్ళీ అక్కడ దేవతలుగా అవుతారు. వారు కూడా త్రేతా వరకూ వృద్ధి చెందుతూ ఉంటారు. క్రైస్టుకు 3,000 సంవత్సరాల క్రితం సత్యయుగము ఉండేదని అంటారు. క్రైస్టుకు పూర్వం, క్రైస్టు తర్వాత అని అంటారు. సత్యయుగములో ఒకే ధర్మము, ఒకే రాజ్యము ఉంటాయి. అక్కడ మనుష్యులు కూడా కొద్దిమందే ఉంటారు. కేవలం భారత్ మాత్రమే ఉంటుంది, ఇంకే ధర్మమూ ఉండదు. కేవలం సూర్యవంశీయులే ఉంటారు. చంద్రవంశీయులు కూడా ఉండరు. సూర్యవంశీయులను భగవాన్-భగవతి అని అనవచ్చు

ఎందుకంటే వారు సంపూర్ణులు.

పతిత-పావనుడు ఒక్క పరమపిత పరమాత్మయేనని పిల్లలైన మీకు తెలుసు. (చక్రం యొక్క చిత్రం వైపు చూపిస్తూ) చూడండి, తండ్రి పైన కూర్చొని ఉన్నారు. ఈ బ్రహ్మ ద్వారా స్థాపన చేయిస్తున్నారు. ఇప్పుడు మీరు చదువుకుంటున్నారు. ఎప్పుడైతే ఈ దేవతల రాజ్యం ఉంటుందో, అప్పుడు ఇంకే ధర్మమూ ఉండదు. మళ్ళీ అర్ధకల్పం తర్వాత వృద్ధి జరుగుతుంది. పై నుండి ఆత్మలు వస్తూ ఉంటారు, వర్ణాలు మారుతూ ఉంటాయి, జీవాత్మలు పెరుగుతూ ఉంటారు. సత్యయుగములో 9 లక్షల మంది ఉంటారు, తర్వాత కోట్ల మంది అవుతారు, అలా వృద్ధి చెందుతూ ఉంటారు. సత్యయుగములో భారత్ శ్రేష్ఠాచారిగా ఉండేది, ఇప్పుడు భ్రష్టాచారిగా ఉంది. అలాగని అన్ని ధర్మాలవారు శ్రేష్ఠాచారులుగా అవుతారని కాదు. ఎంతమంది మనుష్యులు ఉన్నారు. ఇక్కడ కూడా భ్రష్టాచారుల నుండి శ్రేష్ఠాచారులుగా అవ్వడంలో ఎంత శ్రమ ఉంటుంది. ఘడియ-ఘడియ శ్రేష్ఠాచారులుగా అవుతూ-అవుతూ మళ్ళీ వికారాలలోకి వెళ్ళి భ్రష్టాచారులుగా అయిపోతారు. తండ్రి అంటారు, నేను మిమ్మల్ని నల్లని వారి నుండి తెల్లని వారిగా తయారుచేయడానికి వచ్చాను కానీ మీరు ఘడియ-ఘడియ పడిపోతున్నారు. అనంతమైన తండ్రి అయితే విషయాన్ని డైరెక్టుగా తెలియజేస్తారు. వారు అంటున్నారు, కుల-కళంకితులుగా ఎందుకు అవుతున్నారు, నల్ల ముఖము ఎందుకు చేసుకుంటున్నారు, మీరు తెల్లగా అవ్వరా? మీరు అర్ధకల్పం శ్రేష్ఠంగా ఉండేవారు, ఆ తర్వాత కళలు తగ్గిపోతూ ఉంటాయి. కలియుగ అంతిమంలోనైతే కళలు పూర్తిగా సమాప్తమైపోతాయి. సత్యయుగములో కేవలం భారత్ మాత్రమే ఉండేది. ఇప్పుడైతే అన్ని ధర్మాలు ఉన్నాయి. తండ్రి వచ్చి మళ్ళీ సత్యయుగీ శ్రేష్ఠ సృష్టిని స్థాపన చేస్తారు. మీరు కూడా శ్రేష్ఠాచారులుగా అవ్వాలి. శ్రేష్ఠాచారులుగా ఎవరు వచ్చి తయారుచేస్తారు? తండ్రి పేదల పాలిటి పెన్నిధి. ఇక్కడ ధనం యొక్క విషయం కాదు. అనంతమైన తండ్రి వద్దకు శ్రేష్ఠంగా తయారయ్యేందుకు వెళ్లినా కూడా, మీరు అక్కడకు ఎందుకు వెళ్తున్నారని అందరూ అంటారు. ఎన్ని విఘ్నాలు వేస్తారు. ఈ రుద్ర జ్ఞాన యజ్ఞములో అసురుల విఘ్నాలు ఎన్నో కలుగుతాయని మీకు తెలుసు. అబలలపై అత్యాచారాలు జరుగుతాయి. కొందరు స్త్రీలు కూడా ఎంతగానో విసిగిస్తారు. వికారాల కోసం వివాహం చేసుకుంటారు. ఇప్పుడు తండ్రి కామ చితి నుండి దించి జ్ఞాన చితిపై కూర్చోబెడతారు. ఇది జన్మ-జన్మాంతరాల కాంట్రాక్ట్. ఈ సమయంలో ఉన్నదే రావణ రాజ్యము. గవర్నమెంటు ఎన్ని ఆడంబరమైన ఉత్సవాలను జరుపుతుంది. రావణుడిని కాలుస్తారు, ఆటను చూసేందుకు వెళ్తారు. ఇప్పుడు ఈ రావణుడు ఎక్కడి నుండి వచ్చాడు? రావణుడు జన్మ జరిగి 2,500 సంవత్సరాలు అయ్యింది. రావణుడు అందరినీ శోకవాటికలో కూర్చోబెట్టాడు. అందరూ ఎంతో దుఃఖితులుగా ఉన్నారు. రామ రాజ్యంలో అందరూ ఎంతో సుఖవంతులుగా ఉంటారు. ఇప్పుడు ఇది కలియుగం యొక్క అంతిమము. వినాశనం ఎదురుగా నిలిచి ఉంది. ఇన్ని కోట్లమంది మనుష్యులు మరణించబోతున్నారంటే తప్పకుండా యుద్ధం జరుగుతుంది కదా. ఆవగింజల వలె అందరూ నలిగిపోతారు. ఇప్పుడు ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా మీరు చూస్తున్నారు. తండ్రి స్వర్గ స్థాపన చేస్తున్నారు. ఈ జ్ఞానాన్ని ఇంకెవ్వరూ ఇవ్వలేరు. ఈ జ్ఞానాన్ని తండ్రియే వచ్చి ఇస్తారు మరియు పతితులను పావనంగా తయారుచేస్తారు. సద్గతిని ఇచ్చేవారు ఒక్క తండ్రియే. సత్యయుగములో సద్గతియే ఉంటుంది. అక్కడ గురువు యొక్క అవసరం ఉండదు. ఇప్పుడు మీరు ఈ జ్ఞానం ద్వారా త్రికాలదర్శులుగా అవుతారు. సత్యయుగములో లక్ష్మీ-నారాయణులలో ఈ జ్ఞానం ఏమాత్రమూ ఉండదు. మరి పరంపరగా ఈ జ్ఞానం ఎక్కడ నుండి వచ్చింది? ఇప్పుడు ఇది కలియుగం యొక్క అంతిమము. తండ్రి అంటారు, మీరు నన్ను స్మృతి చేయండి. స్వర్గ రాజధానిని స్థాపన చేసే తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి. పవిత్రముగా అయితే తప్పకుండా ఉండవలసి ఉంటుంది. అది పావన ప్రపంచము, ఇది పతిత ప్రపంచము. పావన ప్రపంచములో కంసుడు, జరాసంధుడు, హిరణ్యకశిపుడు మొదలైనవారు ఉండరు. కలియుగ విషయాలను సత్యయుగములోకి తీసుకువెళ్ళారు. శివబాబా కలియుగ అంతిమంలో వచ్చారు. ఈ రోజు శివబాబా వచ్చారు, రేపు శ్రీకృష్ణుడు వస్తారు. కావున శివబాబా మరియు శ్రీకృష్ణుని పాత్రలను కలిపేసారు. శివ భగవానువాచ - వారి ద్వారా చదువుకుని శ్రీకృష్ణుని ఆత్మ ఈ పదవిని పొందుతుంది. వారు పొరపాటున గీతలో శ్రీకృష్ణుని పేరును వేసేసారు. ఈ పొరపాటు మళ్ళీ జరుగుతుంది. మనుష్యులు భ్రష్టాచారులుగా అయినప్పుడే తండ్రి వచ్చి శ్రేష్ఠాచారులుగా తయారుచేస్తారు. శ్రేష్ఠాచారులే 84 జన్మలును పూర్తి చేసి భ్రష్టాచారులుగా అవుతారు. ఈ చక్రముపై అర్థం చేయించడం చాలా సహజము. వృక్షములో కూడా చూపించారు - కింద మీరు రాజయోగ తపస్య చేస్తున్నారు, పైన లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఉంది. ఇప్పుడు మీరు వేర్ల స్థానంలో కూర్చొని ఉన్నారు, పునాది వేయబడుతుంది. తర్వాత సూర్యవంశీ కులము (వైకుంఠము) లోకి వెళ్తారని మీకు తెలుసు. రామ రాజ్యాన్ని వైకుంఠము అని అనరు. వైకుంఠము అని శ్రీకృష్ణుని రాజ్యాన్ని అంటారు.

ఇప్పుడు మీ వద్దకు ఎంతోమంది వస్తారు. ఎగ్జిబిషన్ మొదలైనవాటిలో మీ పేరు ప్రసిద్ధమవుతుంది. ఒకరినొకరు చూసి వృద్ధి చెందుతారు. తండ్రి వచ్చి ఈ విషయాలన్నింటినీ అర్థం చేయిస్తారు. చిత్రాలపై ఎవరికైనా అర్థం చేయించడం చాలా సహజము. సత్యయుగ స్థాపనను భగవంతుడే వచ్చి చేస్తారు. అది కూడా పతిత ప్రపంచములోకే వస్తారు. నల్లగా ఉన్నవారి నుండి తెల్లగా తయారుచేస్తారు. మీరు శ్రీకృష్ణుని రాజధానిలోని వంశావళి కూడా, ప్రజలు కూడా. తండ్రి మంచి రీతిలో అర్థం చేయిస్తారు. నిరాకారుడైన శివబాబా ఆత్మలకు కూర్చొని అర్థం చేయిస్తారు - మీరు నన్ను స్మృతి చేయండి. ఇది ఆత్మిక యాత్ర. ఓ ఆత్మల్లారా, మీరు మీ శాంతిధామాన్ని, నిర్వాణధామాన్ని స్మృతి చేసినట్లయితే స్వర్గ వారసత్వము లభిస్తుంది. ఇప్పుడు మీరు సంగమములో కూర్చున్నారు. తండ్రి అంటారు, నన్ను మరియు మీ వారసత్వాన్ని స్మృతి చేసినట్లయితే మీరు ఇక్కడ స్వర్గములోకి వచ్చేస్తారు. ఎవరు ఎంతగా స్మృతి చేస్తారో మరియు పవిత్రముగా ఉంటారో అంత ఉన్నతమైన పదవి లభిస్తుంది. ధనవాన్ భవ, పుత్రవాన్ భవ, ఆయుష్మాన్ భవ అని మీకు ఎంత గొప్ప దీవెనలు లభిస్తున్నాయి. దేవతల ఆయువు చాలా ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు ఇక ఈ శరీరాన్ని వదిలి వెళ్ళి చిన్నపిల్లవాడిగా అవ్వాలి అని వారికి సాక్షాత్కారమవుతుంది. కావున ఆత్మనైన నేను ఈ పాత శరీరాన్ని వదిలి వెళ్ళి గర్భములో నివసిస్తాను అని లోపల అనిపించాలి. అంత మతి సో గతి (చనిపోయే సమయంలో ఏ ఆలోచన ఉంటుందో అలాంటి జన్మనే తీసుకుంటారు). వృద్ధులుగా అవ్వడం కన్నా మనం వెళ్ళి చిన్న పిల్లలుగా ఎందుకు అవ్వకూడదు? ఆత్మ ఈ శరీరముతో పాటు ఉన్నప్పుడే కష్టమును అనుభవం చేస్తుంది. ఆత్మ ఈ శరీరము నుండి వేరైనప్పుడు ఎటువంటి కష్టము అనుభవమవ్వదు. శరీరము నుండి వేరైపోతే ఇక సమాప్తం. మనం ఇప్పుడు వెళ్ళాలి, తీసుకువెళ్ళేందుకు మూలవతనము నుండి బాబా వస్తారు. ఇది దుఃఖధామము. ఇప్పుడు మనం ముక్తిధామానికి వెళ్తాము. తండ్రి అంటారు, అందరినీ ముక్తిధామానికి తీసుకువెళ్తాను. ఏ ధర్మానికి చెందినవారైనా అందరూ ముక్తిధామానికి వెళ్ళాల్సిందే. వారు పురుషార్థం కూడా ముక్తిలోకి వెళ్ళేందుకే చేస్తారు.

తండ్రి అంటారు, నన్ను స్మృతి చేసినట్లయితే మీరు నా వద్దకు వచ్చేస్తారు. బాబాను స్మృతి చేస్తూ భోజనం చేసినట్లయితే మీకు శక్తి లభిస్తుంది. అశరీరిగా అయి మీరు కాలినడకన ఆబూ రోడ్ వరకూ వెళ్ళండి, ఎప్పుడూ మీకు ఏ విధమైన అలసటా అనుభవమవ్వదు. బాబా ప్రారంభంలో ఈ అభ్యాసాన్ని చేయించేవారు. నేను ఆత్మను అని భావించేవారు. అలా చాలా తేలికగా అయి కాలినడకన వెళ్ళిపోయేవారు. ఏ మాత్రమూ అలసట కలిగేది కాదు. శరీరము లేకుండా ఆత్మ అయిన మీరు క్షణములో బాబా వద్దకు చేరుకోగలరు. ఇక్కడ ఒక శరీరాన్ని వదిలి క్షణములో వెళ్ళి లండన్ లో జన్మ తీసుకుంటారు. ఆత్మ అంతటి వేగవంతమైన వస్తువు ఇంకేదీ ఉండదు. కావున ఇప్పుడు తండ్రి అంటారు - పిల్లలూ, నేను మిమ్మల్ని తీసుకువెళ్ళేందుకు వచ్చాను. ఇప్పుడు బాబానైన నన్ను స్మృతి చేయండి. ఇప్పుడు మీకు ప్రాక్టికల్ గా అనంతమైన పారలౌకిక తండ్రి యొక్క దీవెనలు లభిస్తున్నాయి. తండ్రి పిల్లలకు శ్రేష్ఠాతి-శ్రేష్ఠమైన మతాన్ని ఇస్తున్నారు. ధనము, సంపద మొదలైనవన్నీ మీరు మీ వద్దనే పెట్టుకోండి, కేవలం ట్రస్టీలుగా అయి నడుచుకోండి. ఓ భగవంతుడా, ఇదంతా మీదే అని మీరు అంటూ వచ్చారు. భగవంతుడు బిడ్డను ఇచ్చాడు, భగవంతుడు ఈ ధన-సంపదలను ఇచ్చాడు అని అంటారు. అచ్ఛా! మరి భగవంతుడు వచ్చి చెప్తున్నారు - వీటన్నింటి నుండి బుద్ధియోగాన్ని తొలగించి మీరు ట్రస్టీలుగా అయి నడుచుకోండి. శ్రీమతముపై నడిచినట్లయితే మీరు చెడు కర్మలేవి చేయడం లేదు కదా అన్నది తండ్రికి తెలుస్తుంది. శ్రీమతముపై నడవడం ద్వారానే మీరు శ్రేష్ఠులుగా అవుతారు. అసురీ మతముపై నడవడం ద్వారా మీరు భ్రష్టులుగా అయ్యారు. భ్రష్టులుగా అవ్వడానికి మీకు అర్ధకల్పం పట్టింది. 16 కళల నుండి 14 కళలు కలవారిగా అవుతారు, ఇక నెమ్మది-నెమ్మదిగా కళలు తగ్గిపోతూ ఉంటాయి, మరి ఇందులో సమయం పడుతుంది కదా. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. నడుస్తూ-తిరుగుతూ ఆశరీరిగా అయ్యే అభ్యాసాన్ని చేయాలి. భోజనాన్ని ఒక్క తండ్రి స్మృతిలో తినాలి.

2. తల్లి-తండ్రి యొక్క దీవెనలను తీసుకోవాలి. ట్రస్టీలుగా అయి ఉండాలి. ఎటువంటి చెడు కర్మలను చేయకూడదు.

వరదానము:- అనాసక్తులుగా అయి లౌకికము వారిని సంతుష్టము చేస్తూ కూడా ఈశ్వరీయ సంపాదనను జమ చేసుకునే రహస్యయుక్త భవ

చాలామంది పిల్లలు లౌకిక కార్యాలను, లౌకిక ప్రవృత్తిని, లౌకిక సంబంధ-సంపర్కాలను నిర్వహిస్తూ కూడా తమ విశాల బుద్ధి ద్వారా అందరినీ సంతుష్టపరుస్తారు మరియు ఈశ్వరీయ సంపాదన యొక్క రహస్యాన్ని తెలుసుకుని విశేషమైన భాగాన్ని కూడా కేటాయిస్తారు. ఇటువంటి ఎకానామి మరియు ఏకనామి గల అనాసక్తులైన పిల్లలు సర్వ ఖజానాలను, సమయాన్ని, శక్తులను మరియు స్థూల ధనాన్ని లౌకికము నుండి పొదుపు చేసి అలౌకిక కార్యములో విశాలహృదయముతో వినియోగిస్తారు. ఇటువంటి యుక్తియుక్తమైన, రహస్యయుక్తమైన పిల్లలే మహిమాయోగ్యులు.

స్లోగన్:- స్మృతి స్వరూపులుగా అయి ప్రతి కర్మనూ చేసేవారే ప్రకాశ స్తంభముగా (లైట్ హౌస్ ) అవుతారు.